హక్కుల సంఘాలకు విజప్తి

# ప్రైవేట్ ముఠాల బీభత్సాన్ని ఆపుదాం

(రాష్ట్రంలో కొంతకాలం బీభత్సం సృష్టించిన ప్రైవేటు హంతక ముఠాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టమని కోరుతూ దేశంలోని వివిధ హక్కుల సంఘాలకు 11.2.2006 నాడు మానవహక్కుల వేదిక పంపిన లేఖ)

**మిత్రులారా,**

ఆంధ్రప్రదేశ్‌లో 'టైగర్లు', 'కోబ్రాల' పేరిట విచ్చలవిడి హత్యలకు పాల్పడుతున్న ప్రైవేట్ ముఠాల గురించి మీకు తెలుసును. దానికి సంబంధించిన మరికొన్ని వివరాలు మీకు తెలియజేసి రాష్ట్ర ముఖ్యమంత్రికి నిరసన లేఖలు రాయవలసిందిగా, రాయించవలసిందిగా మిమ్మల్ని కోరడం కోసం ఈ లేఖ రాస్తున్నాం.

నక్సలైట్ పార్టీల లీగల్ సంస్థల పైన, పౌరహక్కుల కార్యకర్తల పైన, దాడులు చేయడానికి ప్రైవేటు ముఠాలను సృష్టించే ప్రయత్నం కొత్తది కాదు. 1980ల ద్వితీయార్థంలో కరీంనగర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా ఉన్న అశోక్ ప్రసాద్ అనే అధికారి నక్సలైట్ల వల్ల హింసకు గురైన వారిని సమీకరించి వారికి వ్యతిరేకంగా నిలబెట్టాలని ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నం పౌర హక్కుల కార్యకర్తలను ఇబ్బందిపెట్టడం తప్ప వేరే సాధించింది ఏమీలేదు.

1990ల మధ్య భాగంలో క్రాంతిసేన అనే పేరు వినవచ్చింది. ప్రధానంగా కరీంనగర్ జిల్లాలోని కొన్ని గ్రామాలలో రాడికల్ కార్యకర్తలను ఈ క్రాంతిసేన హతమార్చింది. అదీ బహుశా తెల్లబట్టల పోలీసు బృందమే అయి ఉంటుంది. ఈ మధ్య కాలంలో క్రాంతిసేన పేరు వినపడడం లేదు.

ఆ తరువాత గ్రీన్ టైగర్స్ అన్న పేరు ఉనికిలోకి వచ్చింది. మొదట్లో ఆ పేరు మీద పౌరహక్కుల కార్యకర్తలకూ, మావోయిస్టు పార్టీకి (2004 సెప్టెంబర్ దాకా పీపుల్స్‌వార్ పార్టీ అనేవారు) సన్నిహితులుగా భావించబడే రాజకీయ/ సాంస్కృతిక కార్యకర్తలకూ బెదిరింపులు వచ్చాయి. అప్పట్లో గ్రీన్ టైగర్స్ చేసిన అత్యంత భయానక చర్య, 6.4.1997 నాడు ప్రఖ్యాత విప్లవ సాంస్కృతిక

కార్యకర్త గద్దర్ పైన జరిపిన కాల్పులు. ఇప్పటిదాకా ఆ దాడి ఎవరు చేసిందీ తేల్చలేదు, ఎవరినీ అరెస్టు చేయలేదు.

మొదట్లో బహుశా ఈ గ్రీన్ టైగర్స్ కూడా తెల్లబట్టల పోలీసులే అయి ఉండవచ్చును. ఉదాహరణకు వరంగల్‌లో గ్రీన్ టైగర్స్ నాయకుడు హరిభూషణ్ పేరు మీద ఫోన్ పైన బెదిరింపులు జారీచేస్తున్న వ్యక్తి, ఈ కర్తవ్యం కోసమే పోలీసు శాఖ నుంచి సస్పెండ్ చేయబడ్డ జావేద్ అనే కానిస్టేబుల్ అన్న విషయం అందరూ ఎరిగినదే. 2004 సంవత్సరంలో ప్రభుత్వానికీ, మావోయిస్టులకూ జరిగిన చర్చల నేపథ్యంలో తాత్కాలికంగా వెల్లివిరిసిన జవాబుదారీతనం కారణంగా కాబోలు పోలీసు శాఖ ఈ సత్యాన్ని అంగీకరించి అతనిని అరెస్టు చేసింది. ప్రైవేటు ముఠాలకు చెందిన వారిపైన ఏదైనా చర్యతీసుకున్న ఏకైక ఘటన ఇది. మానవహక్కుల వేదిక ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులైన డా. బుర్ర రాములును ఇతను టెలిఫోన్ ద్వారాను, పత్రికా ప్రకటనల ద్వారాను తరచుగా బెదిరించేవాడు.

తెల్లబట్టల పోలీసుల దాడులుగా, బెదిరింపులుగా మొదలైన ఈ క్రమం, నక్సలైట్ పార్టీలలో పనిచేస్తున్న కార్యకర్తలను ప్రభుత్వం తన వైపు తిప్పుకోవడంతో ప్రమాదకర రూపం తీసుకుంది. పార్టీతో విభేదాలు వచ్చి బయటికొచ్చిన వారిని చేరదీసి ప్రైవేటు ముఠాలు ఏర్పాటుచేయడానికి ప్రోత్సహించడం కొందరి విషయంలో జరిగింది. మరికొందరికి పార్టీలో ఉండగానే డబ్బులిచ్చి వారి కామ్రేడ్లను చంపి ఆయుధంతో సహా బయటికొచ్చి నక్సలైట్ – వ్యతిరేక ముఠాలు ఏర్పాటు చేయమని ప్రోత్సహించారు. ఒక వైపు ఈ పనిచేస్తూ మరొకవైపు వ్యాపార తగాదాలను, భూమి తగాదాలను బలప్రయోగంతో పరిష్కరించి డబ్బులు చేసుకునే అవకాశం వారికిచ్చారు. వారి ఆగడాలను పోలీసులు చూసీచూడనట్టు పోతున్నారు. బహుశా వారి సంపాదనలో వాటా కూడా తీసుకుంటున్నారు.

ఈ నక్సలైట్ – వ్యతిరేక ముఠాదారులలో ప్రథముడైన కత్తుల సమ్మయ్య కరీంనగర్ జిల్లాలో పీపుల్స్‌వార్ దళ సభ్యుడు. 1993లో నిద్రిస్తున్న తన కామ్రేడ్లు ముగ్గురిని కాల్చిచంపి ఆయుధాలతో సహా పోలీసుల వద్దకు పారిపోయాడు. ఆ తరువాత పోలీసుల అండతో బెదిరించి వసూళ్ళు చేసుకొని బతకసాగాడు. పీపుల్స్‌వార్‌కు సంబంధించిన మరొక ముగ్గురిని హతమార్చాడు. పేద కుటుంబంలో పుట్టిన సమ్మయ్య ఎంత వేగంగా పైకి పోయాడంటే 2001లో అతని మరణం, వ్యాపారరీత్యా విమాన ప్రయాణంలో ఉండగా కొలొంబోలో జరిగిన ప్రమాదంలో సంభవించింది. కనీసం ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు అతని సంపాదనలో భాగస్వాములని పత్రికలు రాశాయి, చాలా మంది నమ్ముతున్నారు. అయితే ఇది సమ్మయ్యకు ప్రత్యేకమైన విషయం కాదు. నక్సలైట్ – వ్యతిరేక ముఠాలు చేపట్టే బెదిరింపు వసూళ్ళు, బలవంతపు పంచాయతీలు, సందేహాస్పద ఆర్థిక లావాదేవీలన్నిటిలోనూ పోలీసు అధికారులకు భాగస్వామ్యం ఉంది.

ఇతర ప్రముఖ నక్సలైట్ – వ్యతిరేక ముఠాదారులు మహమ్మద్ నయీముద్దీన్, బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు, తిరుపతి బాలన్న. నయీముద్దీన్‌ది నల్గొండ జిల్లా భువనగిరి. అయితే ఇతను హైదరాబాద్‌లోనో, హైదరాబాద్ సమీపంలోనో నివసిస్తాడు. పోలీసుల పూర్తి సంరక్షణలో బతుకుతాడనేది జగమెరిగిన సత్యం. పీపుల్స్‌వార్ కార్యకర్తగా ఉన్నప్పుడతను కె.ఎస్.వ్యాస్ అనే

పోలీసు డిఐజి సంచలనాత్మక హత్యలో పాల్గొన్నాడు. 'ఎన్‌కౌంటర్' హత్యల విషయంలో అపఖ్యాతి గడించిన ఆ అధికారిని హైదరాబాద్‌లోని ఫతేమైదాన్‌లో జాగింగ్ చేస్తుండగా కాల్చి చంపడం జరిగింది. నయీముద్దీన్ అత్యంత భీతిగొలిపే నక్సలైట్ – వ్యతిరేక ముఠా నాయకునిగా మారిన వైనం తెలుసుకోదగ్గది. జైలులో ఉండగా అతనికి పీపుల్స్‌వార్ నాయకత్వంతో తేడాలు వచ్చాయి. తన సోదరిని లైంగికంగా వేధించిన మిలిటెంట్ పైన వాళ్ళు చర్య తీసుకోలేదని అతను కోపగించు కున్నాడు. అతని తమ్ముడు అలీముద్దీన్ ఆ మిలిటెంట్‌ను అతిక్రూరంగా చంపాడు. అలీముద్దీన్ ఉన్మాద స్వభావం గలవాడు. ఇదిలా ఉండగా ఇంకా జైలులో ఉండగానే నయీముద్దీన్ బెల్లి లలిత అనే సాంస్కృతిక కార్యకర్తను ప్రేమించాడు. అయితే అలీముద్దీన్ ఆమె తన అన్నను మోసం చేస్తున్నదని అనుమానించి ఆమెను చాలా క్రూరంగా చంపాడు. అలీముద్దీన్‌ను పీపుల్స్‌వార్ చంపింది.

దీనితో మొదలైన కక్ష ఆ పార్టీనీ, వారి సానుభూతిపరులనూ హక్కుల కార్యకర్తలనూ భీతా వహులను చేసింది. నయీముద్దీన్ జైలులో ఉంటూనే ప్రభుత్వానికి సరండర్ అయ్యాడు. అతని బెయిల్ అప్లికేషన్‌ను ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం వల్ల బెయిల్ పొంది బయటకు వచ్చాడు. ఈ రోజు నక్సలైట్ – వ్యతిరేకులందరిలోకీ అతను అత్యంత భయం గొలిపించే వ్యక్తి, అత్యంత క్రూరుడు. అతని చుట్టూ అతని మనుషులు 50 మంది దాకా ఉంటారు. ఈ ముఠా తాము ఎంపిక చేసుకున్న వ్యక్తుల పైన అతిక్రూరంగా దాడులు చేసింది. తనకు శత్రువులైన మావోయిస్టు నాయకత్వానికి సన్నిహితులైన వారిమీద మాత్రమే తాను దాడి చేస్తున్నానని నయీముద్దీన్ పత్రికల వారితో అంటున్నప్పటికీ, అతని వల్ల ఏర్పడిన బీభత్స వాతావరణం అక్కడితో ఆగలేదు. ఏండ్ల తరబడి పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటించి పని చేసిన కార్యకర్తలు అతని నుంచి ఒక్క ఫోన్ వస్తే పని మానుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి)కి చెందిన టి.పురుషోత్తంను 2000 సంవ త్సరం నవంబర్ 23న హతమార్చింది అతని ముఠాయే అనడంలో సందేహం లేదు. అదే సంస్థకు చెందిన మహమ్మద్ ఆజం అలీని నల్గొండలో 2002 ఫిబ్రవరి 18 నాడు చంపింది కూడా అతని మనుషులే. ఎపిసిఎల్‌సి అధ్యక్షుడు డా. జి.లక్ష్మణ్‌ను 2003 నవంబర్ 6వ తేదీన కిడ్నాప్ చేసిన ఘటనలో నయీముద్దీన్ స్వయంగా పాల్గొన్నాడు. అదే సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన తిరుపతిలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పైన జరిగిన హత్యా ప్రయత్నం నేపథ్యంలో ఇది జరిగింది. డా. లక్ష్మణ్‌ను తీవ్రంగా చిత్రహింసలకు గురిచేశారు. తననెవరూ కిడ్నాప్ చేయ లేదనీ, హింసించలేదనీ అతని చేతనే చెప్పించారు. మావోయిస్టుల చెరలో ఉన్న ఒక 'కోవర్టు' విడు దల కోసం బందీగా డా. లక్ష్మణ్‌ను అపహరించడం జరిగింది. అతని విడుదల కోసం చంద్రబాబు నాయుడును కలిసిన బృందానికి చంద్రబాబు హామీ ఇచ్చిన అనంతరం, మావోయిస్టులు ఆ 'కోవర్టు'ను హతమార్చినప్పటికీ డా. లక్ష్మణ్‌ను క్షేమంగా విడిచిపెట్టడం జరిగింది. తిరుమల టైగర్స్ అనే పేరు మీద నయీముద్దీన్ అపహరించిన మనిషి క్షేమానికి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం, ఆ హామీని నిలబెట్టుకోగలగడం గమనించదగ్గ విషయాలు.

బయ్యపు సమ్మిరెడ్డి, జడల నాగరాజు కరీంనగర్ జిల్లాకు చెందిన వారు. అయితే సమ్మిరెడ్డి ఇప్పుడు లేదు. అతను పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ నాయకుడిగా ఉండగానే, కనీసం ఒక సందర్భంలో

గ్రామంలో రెడ్డి కులస్తుల మాటలు విని సామాజికంగా వెనుకబడిన వర్గాల పార్టీ సానుభూతిపరులకు అన్యాయం చేశాడన్న అభియోగం ఉంది. తరువాత అతను సరండర్ అయి బలవంతపు వసూళ్ళు, పంచాయితులు చేస్తూ సంపాదించుకోసాగాడు. జిల్లాలో తన మాజీ కామ్రేడ్లకు టెర్రర్‌గా తయారయ్యాడు. అదృష్టవశాత్తు అతని నేరచరిత్ర త్వరలోనే ముగింపు కొచ్చింది. 2003 జులై 18న అతని శవాన్ని కృష్ణా జిల్లాలో ఒక మంచినీటి చెరువు నుంచి బయటకు తీశారు. అతన్ని జడల నాగరాజు చంపాడని అతని భార్య ఆరోపించింది. ఏదో భూమి తగాదాలోనో, వ్యాపార పంచాయతీలోనో వారు వైరిపక్షాలు తీసుకున్నట్టున్నారు.

నాగరాజు అప్పటి పీపుల్స్‌వార్ దళ సభ్యుడు. 1998 డిసెంబర్ నెల 11, 12 తేదీల మధ్య రాత్రి అప్పటి తన పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శితో సహా తన కామ్రేడ్లను హతమార్చి బయటి కొచ్చాడు. అప్పటి రాష్ట్ర హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి టివి కెమేరాలు సాక్షిగా అతనికి బహుమానం అందిచ్చాడు. (ఈయనను పీపుల్స్‌వార్ ఆ తరువాతి కాలంలో రద్దీగా ఉండే హైదరాబాద్ – వరంగల్ రహదారిపైన మందుపాతర పేల్చి చంపింది). నాగరాజు తదుపరి కరీంనగర్ జిల్లా ఈశాన్య ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఒక ముఠా పెట్టుకొని 'డాన్'గా వ్యవహరించ సాగాడు. జిల్లాలోని సామాజిక కార్యకర్తలను అతని ముఠా విపరీతంగా భీతిల్లజేసింది. ఇతర నక్సలైట్ వ్యతిరేక ముఠాదారుల లాగ కాక ఇతను ఎన్నికల రంగంలోకి కూడా దిగాడు. అక్కడ కూడా తన వాళ్ళ విజయానికి బలప్రయోగం చేస్తాడు. (అయితే ఇప్పటికీ ఏ పార్టీలోనూ చేరలేదు). అతను ఖమ్మంపల్లి గ్రామం ఎంపిటిసిగా ఎన్నికయ్యాడు. అతని మనుషులు వివిధ పంచాయతీ పదవులు అలంకరించారు. అతను తన కామ్రేడ్లను చంపిన ఘటనకు అతనిని ప్రాసిక్యూట్ చేయకుండా అతనికి పారితోషికం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయగా, సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేయడం జరిగింది.★ ఈ మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్వహించే బొగ్గు గనుల ప్రాంతంలో అతని సృష్టి అయిన కోల్‌బెల్ట్ విముక్తి సైన్యం బెదిరింపు ప్రకటనలు ఇస్తున్నది. ఇది ఒకప్పుడు మావోయిస్టులకు చాలా బలం ఉన్న ప్రాంతం. మావోయిస్టులకు ఏ రకంగానైనా మద్దతు, సహకారం ఇచ్చినట్టయితే ఖబడ్దార్ అంటూ వీరి ప్రకటనలు వెలువడినప్పటి నుంచి బొగ్గు గనుల ప్రాంతంలో విపరీతమైన భీతి నెలకొనింది.

తిరుపతి బాలన్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాడు. అతను నయీముద్దీన్ ముఠాతో పని చేస్తాడని చాలామంది అభిప్రాయం. ఎపిసిఎల్‌సికి చెందిన ఆజం ఆలీ హత్యలో అతను పాల్గొన్నాడన్న అభిప్రాయమూ ఉంది. 2003 డిసెంబర్ 11వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో దాదాపు ప్రాణాంతకమైన ఒక 'ప్రమాదం' జరిగింది. ఎపిసిఎల్‌సికి చెందిన బిచ్చారెడ్డిని ఒక కారు ఢీకొనింది. బిచ్చారెడ్డి ప్రాణం దక్కింది గానీ ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. అది ప్రమాదం కాదనీ అతనిని హత్య చేయడానికి చేసిన ప్రయత్నమనీ కచ్చితంగా చెప్పవచ్చు.

ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమిటంటే ప్రజాతంత్ర సంస్థల డిమాండ్ల కారణంగా టి.పురుషోత్తం హత్య కేసులోనూ, మహమ్మద్ ఆజం ఆలీ హత్య కేసులోనూ మహమ్మద్ నయీ

★ ఇటీవల సుప్రీంకోర్టు ఏ కారణం చూపించకుండానే ఆ అప్పీల్‌ను కొట్టేసింది – సంపాదకులు.

ముద్దీన్‌నూ, అతని ముఠాకు చెందిన కొందరు వ్యక్తులనూ ముద్దాయిలుగా చూపిస్తూ చార్జిషీటు దాఖలు చేశారు. అయితే కోర్టు వారిని నిర్దోషులుగా ప్రకటించింది.

సిపిఐ (ఎం-ఎల్) (జనశక్తి) పార్టీకి కరీంనగర్ జిల్లా కమిటీ నాయకుడిగా ఉన్న రణదేవ్ 2003లో తాను సరండర్ కావడమే కాక జిల్లా కమిటీని మొత్తంగా ఆయుధాలతో సహా సరండర్ చేయించాడు. అందుకు మారుగా పోలీసులు అతనికి, అతని మనుషులకు, జిల్లాలో ఒక ముఠాగా వ్యవహరిస్తూ బలవంతపు వసూళ్ళు చేసుకోవడానికి, పంచాయతీలు చేయడానికి స్వేచ్ఛనిచ్చారు. తమ ఆదేశాలు అమలుచేయడం కోసం వీరు పట్టపగలే వ్యక్తులను అపహరించి తమ వాహనాలలో తీసుకుపోతారు. వారి చెర నుంచి విడుదలైన తరువాత ఆ వ్యక్తులు ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు పోతే, తమను కిడ్నాప్ చేసిన వాహనం స్టేషన్ బయటే ఉండడం చాలా తరచుగా ఎదురయ్యే అనుభవం. ఈ ముఠా సంపాదించుకొన్న డబ్బుల్లో ఒక భాగం పోలీసుల పరం అవుతుందని వేరే చెప్పనవసరం లేదనుకుంటా. వాళ్ళంతా మాజీ నక్సలైట్లు కావడం వల్ల ప్రతి ఒక్కరి మీదా క్రిమినల్ కేసులున్నాయి. ఆ కేసులేవీ ప్రభుత్వం ఉపసంహరించలేదు. అయితే కోర్టు వారంటు జారీ చేసినా కూడా పోలీసులు వారిని అరెస్టు చేయరు. సిరిసిల్లలో జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేటుగా ఉన్న శ్రీ కె.రాజన్న ఒక సందర్భంలో వారంట్లు ఇచ్చినా ఎందుకు అరెస్టు చేయడం లేదని కోర్టులోనే పోలీసులను నిలదీసి అడిగేసరికి, ఆ సాయంత్రమే వారికి రణదేవ్ నుంచి ఫోన్ వచ్చింది. ఎవరితో పెట్టుకుంటున్నవో తెలుసా అని గౌ. మేజిస్ట్రేటునే అతను బెదిరించాడు. పోలీసులను తిట్టినందుకు అమర్యాదగా అభ్యంతరం చెప్పాడు.

పైన చెప్పినట్టు, గ్రీన్ టైగర్స్ అనేది ఆవిర్భావంలో తెల్లబట్టల పోలీసులు ముఠాయే అయి ఉండవచ్చు. కార్యకర్తలను బెదిరించడానికీ వారి పైన దాడి చేయడానికీ పోలీసులే ఆ పేరు పెట్టుకొని ఉండవచ్చు. అయితే మాజీ నక్సలైట్ ముఠాలు ఏర్పడిన తరువాత బెదిరింపులు జారీ చేయడానికి వారూ ఆ పేరే వాడుకోవడం జరిగింది. బహుశా అది పోలీసుల, నేరచరిత గల మాజీ నక్సలైట్ల ఉమ్మడి వేదిక కావచ్చు. టి.పురుషోత్తంను నయీముద్దీన్ ముఠా హత్య చేయక ముందు గ్రీన్ టైగర్స్ పేరు మీద అతనికి బెదిరింపులు వచ్చాయి. నయీముద్దీన్ డా. లక్ష్మణ్‌ను అపహరించి చిత్రహింసలు పెట్టినప్పుడు తిరుమల టైగర్స్ నాయకుడు సింగమలై పేరుతో పేపర్లకు ప్రకటన ఇచ్చాడు. సింగమలై అనేది ఒక తెలుగు సినిమాలో దుష్టులను శిక్షించే హీరో పేరు. ఇక 'తిరుమల' అన్న పేరు పెట్టుకోవడానికి కారణం, 2003 అక్టోబర్ 1వ తేదీన తిరుపతిలో మావోయిస్టులు చంద్రబాబు నాయుడు పైన జరిపిన హత్యాప్రయత్నానికి ఇది ప్రతీకారం అని ప్రకటించడం కావచ్చు.

2004 సంవత్సరం రెండవ సగంలో ప్రభుత్వమూ, నక్సలైట్లూ కాల్పుల విరమణ పాటించి చర్చల ప్రక్రియను మొదలుపెట్టే ప్రయత్నం జరిగినప్పుడు, ఈ సాయుధ ముఠాలను నిరాయుధులు చేయాలన్నది మావోయిస్టుల వైపు నుంచి వచ్చిన డిమాండ్లలో ఒకటి. అయినా అటువంటిదేమీ జరగలేదని చెప్పనక్కర లేదనుకుంటాము.

అయితే ఈ చర్చల ప్రక్రియ 2005 సంవత్సరంలో నిలిచిపోయిన తరువాత వివిధ 'కోబ్రాల' గుంపులు తలెత్తడం ఈ ప్రైవేటు ముఠాలవల్ల కలిగిన భయాన్ని ఇనుమడింపచేసింది. పైన పేర్కొన్న ఘటనలన్నీ నక్సలైట్ ఉద్యమానికి తొలి వేదిక అయిన ఉత్తర తెలంగాణ జిల్లాలలో జరగగా,

కో(బ్రాల పేరిట వ్యవహరిస్తున్న ముఠాల చర్యలు పత్రికలు 'నల్లమల జోన్'గా వ్యవహరిస్తున్న దక్షిణాది ప్రాంతంలో జరిగాయి. ఇది తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, రాయలసీమలోని కర్నూలు జిల్లా, కోస్తాలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎగువ ప్రాంతంలో కృష్ణా బేసిన్‌లోని నల్లమల అడవుల చుట్టూ ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతం ఈ మధ్య కాలంలో మావోయిస్టు ఉద్యమాని కొక ముఖ్య కేంద్రంగా రూపొందింది. సంప్రదాయకంగా ఇది ముఠా కొట్లాటలకూ ప్రతీకార సంస్కృతికీ పేరుపడిన ప్రాంతం. ఇక్కడ హత్యకు స్పందన పోలీసు కేసు రూపంలో ఉండదు, ప్రతీకార హత్య రూపంలో ఉంటుంది. 'కో(బ్రాల' చర్యలు నక్సలైట్ బాధితులు జరుపుతున్న ప్రతీకార చర్యలేనన్న అభిప్రాయం కలిగించడానికి పోలీసులు, ముఖ్యంగా రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ స్వరణ్‌జిత్ సేన్ ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రతీకారానికి ఆస్కారమే లేదని అనలేము గానీ మూడు విషయాలు ఈ సందర్భంగా ప్రస్తావించాలి. 'కో(బ్రాల' పేరు మీద బెదిరింపు ఫోన్లు చేసే వాళ్ళకు పోలీసులకు మాత్రమే తెలిసి ఉండగల విషయాలు తెలిసి ఉండడం బాధితులు తరచుగా గమనించారు. రెండు, పోలీసులకు గానీ పోలీసులకు ఆప్తులైన మహమ్మద్ నయీముద్దీన్ వంటి వారికి గానీ ఏదైనా నష్టం లేక కష్టం కలిగినప్పుడే కో(బ్రాల పేరు మీద లేక కో(బ్రాలు వ్యవహరించే ప్రాంతాల నుంచి బెదిరింపులు వస్తుండడం కూడా గమనించదగ్గ విషయమే. మూడు రోజు రోజుకూ మరింత నిస్సంకోచంగా సాగుతున్న కో(బ్రాల హింసాకాండను పోలీసులు మురిపెంగా తిలకిస్తున్నారు తప్ప ఏమీ చేయడం లేదు.

2005 ఆగస్టు 15 నాడు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట ఎంఎల్ఏ నర్సిరెడ్డిని మావోయిస్టులు చంపడంతో ఇది మొదలయింది. జెండా ఎగురవేయడానికి ఆయన అదే జిల్లాలోని మక్తల్‌కు పోగా అక్కడ ఈ హత్య జరిగింది. హింస విషయంలో మావోయిస్టులు ఈ మధ్య కాలంలో అలవరచుకున్న విచ్చలవిడి వైఖరికి ఈ ఘటన ఒక మచ్చుతునక. ఒకరిని చంపడం వారి లక్ష్యం కాగా, అతను నిలబడి ఉన్న గుంపు మీదికి కాల్పులు జరిపి పది మందిని చంపారు (మరొకరు తరువాత ఆస్పత్రిలో చనిపోయారు). అసలు నర్సిరెడ్డిని చంపడానికి ఎందుకు ఎంచు కున్నారన్న ప్రశ్నకు కూడా మావోయిస్టుల వైపు నుంచి జవాబు లేదు. అతను సగటు కాంగ్రెస్ వాది. పెద్దగా మంచివాడూ కాదు. పెద్దగా దుర్మార్గుడూ కాదు. అతను చంపదగ్గవాడే అయితే రాష్ట్రంలో ఏ కాంగ్రెస్ వాడినైనా చంపవచ్చు.

ఆగస్టు 24వ తేదీన మహబూబ్‌నగర్ నివాసి, వృత్తిరీత్యా అధ్యాపకుడు, అనేక ప్రజాహిత ఉద్యమాలలో నిబద్ధతతో పని చేసిన కార్యకర్త అయిన కె.కెనకాచారిని స్కూలుకు పోతుండగా అప హరించి నరికి చంపారు. అతని మృతదేహాన్ని మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్ళే రహ దారి పక్కన పడేశారు. అప్పటికి ఒక వారం ముందు, అంటే ఆగస్టు 17న, నర్సాకో(బ్రాలు అనే పేరు మీద పత్రికలలో ఒక ప్రకటన వచ్చింది. కనకాచారితో సహా చాలామంది కార్యకర్తల పేర్ల జాబితా ఇచ్చి, వారినందరినీ నర్సిరెడ్డి హత్యకు నిరసనగా అంతం చేస్తామని ఆ ప్రకటనలో అన్నారు. కనకాచారి దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం కార్యవర్గ సభ్యుడు.

2005 సెప్టెంబర్ 10వ తేదీన కులనిర్మూలన పోరాట వేదిక ప్రకాశం జిల్లా కమిటీ అధ్యక్షుడైన మన్నెం ప్రసాదును శింగరాయకొండలో అతను పనిచేసే సహకార సంఘం కార్యా

లయంలోనే హత్య చేశారు. ఈ ఘటన 5వ నంబర్ జాతీయ రహదారి మీద పట్టపగలు జరిగింది. నల్లమల నల్లకోబ్రాలు అనే ముఠా అతనిని చంపినట్టు ప్రకటించింది. ఈ ముఠా వివిధ ప్రజాతంత్ర సంస్థల కార్యకర్తలు తమ కార్యకలాపాలు మానుకోవాలని బెదిరిస్తూ నిందలతో కూడిన ప్రకటనలు కొంత కాలంగా ఇస్తూ ఉంది. వారి బెదిరింపు ప్రకటనలలో తరచుగా ప్రస్తావించే వ్యక్తులలో ఒకరు మానవహక్కుల వేదిక ప్రకాశం జిల్లా కమిటీ కన్వీనర్ అయిన ఎన్.వేణుగోపాల్. నిజానికి ప్రకాశం జిల్లాలోని నల్లమల ప్రాంతమైన మార్కాపురం డివిజన్ ఈ కోబ్రాల కార్యకలాపాల కొక కేంద్రంగా ఉంది. రాష్ట్ర వ్యాపితంగా చాలామంది కార్యకర్తలు అందుకొన్న బెదిరింపు ఫోన్లు ఈ డివిజన్ నుంచే వచ్చాయి.

ఈ రెండు ఘటనలు జరిగిన అనంతరం రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ 'కోబ్రాలు' చేస్తున్న హింస నక్సలైట్ బాధితుల ప్రతీకార చర్యలంటూ వివరించడం విన్నాం. దీని సత్యాసత్యాల సంగతి దిగువ చూద్దాంగానీ, ఆయన ప్రకటన చేసిన పద్ధతి నక్సలైట్ సానుభూతి పరులుగా ముద్ర ఉన్న వారి పైన ప్రైవేటు వ్యక్తుల దాడులను ప్రోత్సహించేదిగా ఉంది. కొద్దిరోజుల లోపలే 'ఒక నక్సలైట్ బాధితుల సంఘం' కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబటిపల్లిలో కిలింగరావు అనే వ్యక్తిని చంపింది. ఇది జరిగింది 2005 సెప్టెంబర్ 14న. ముందు రోజు నక్సలైట్లు చేసిన ఒక హత్యకు ప్రతీకారంగా అతనిని చంపినట్టు ఆ సంఘం ప్రకటించింది. హంతకులు పోలీసులే అయి ఉండాలి లేదా డిజిపి గారి ప్రకటన నుంచి సంకేతాన్ని అందుకున్న వ్యక్తులైనా అయి ఉండాలి. 2005 నవంబర్ 19న ఎపిసిఎల్‌సి వరంగల్ జిల్లా కమిటీ బాధ్యుడైన వీరన్న మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాలబెట్టారు. నవంబర్ 23న అనంతపురంలో ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి అయిన ప్రొఫెసర్ శేషయ్య ఇంటిపైన గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి అతని కారును తగులబెట్టారు. నవంబర్ 28న మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అలీపూర్‌లో మునయ్య అనే దళిత అధ్యాపకుడిని నర్సా కోబ్రాలు స్కూలు నుంచి తిరిగి వస్తుండగా నరికి చంపారు. అతను ప్రజాతంత్ర ఉపాధ్యాయ సమాఖ్య సభ్యుడు. అప్పట్లో మావోయిస్టులు చంపిన ఎంఎల్ఏ నర్సిరెడ్డి స్థానానికి ఉప ఎన్నిక జరుగుతూ ఉంది. అతని కుమారుడిని ఏక గ్రీవంగా ఎన్నిక కానివ్వాలన్న అతని కుటుంబ సభ్యుల కోరికను అన్ని ప్రధాన పార్టీలూ మన్నించగా, మునయ్య బంధువొకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. (వేరే కొందరు స్వతంత్ర అభ్య ర్థులు కూడా నామినేషన్ వేశారు). నర్సిరెడ్డి స్థానంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరగవలసిన అవసర మేమీ లేదని మునయ్య ఎవరితోనో అన్నట్టు వినికిడి.

ఈ రహస్య ముఠాలలో ఉన్నది అత్యధికం పోలీసులేనన్న మా అభిప్రాయం ఇప్పటికే చెప్పాము. వారితోపాటు మహమ్మద్ నయీముద్దీన్, జడల నాగరాజు మొదలైన నేరస్తులుగా మారిన మాజీ నక్సలైట్లూ ఉన్నారు. వీరేకాక ఒక మూడవ కోవకు చెందిన వారూ ఉండవచ్చు. డిజిపి గారు చెప్పే 'నక్సలైట్ బాధితులకు' వీరు కొంత దగ్గరగా ఉంటారు. వీరు నక్సలైట్ల చేత ఇన్ ఫార్మర్లుగా, పోలీసు ఏజెంట్లుగా ముద్రవేయబడ్డ వారు. ఆ నింద నిజమైనా అబద్ధమైనా అది మరణ దండనే. గతంలో అటువంటి వాళ్ళకు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి మార్గమేదీ ఉండేది కాదు. ఇప్పుడు ఈ ముఠాలలో చేరడం ఒక మార్గం. వీరుకాక వేరే 'నక్సలైట్ బాధితులు' ఈ ముఠాలలో ఉన్నారని మేము అనుకోవడం లేదు.

అయితే నక్సలైట్ బాధితులు అనే వాళ్ళు నిజంగా లేరా, వారికి నక్సలైట్ల పట్ల న్యాయబద్ధమైన వ్యతిరేకత ఉండదా అన్నదిక్కడ ప్రశ్నకాదు. నక్సలైట్ల హింస – ముఖ్యంగా మావోయిస్టుల హింస తక్కువేమీ కాదు. వారు చేస్తున్న అన్ని చర్యలూ వారి రాజకీయ విలువలకు సైతం లోబడి ఉన్నట్టు కనిపించదు. నక్సలైట్ల లక్ష్యశుద్ధిలేని హింసాత్మక చర్యలపట్ల న్యాయమైన ఆగ్రహం ఉన్నవారు సమాజంలో చాలామందే ఉన్నారని నిర్ధారించడానికి కావలసినంత సమాచారం ఉంది. కానీ అదికాదు సమస్య. ప్రభుత్వం ఈ ప్రైవేటు ముఠాలను పనిగట్టుకొని ప్రోత్సహిస్తున్నది. వారు హత్యలు చేస్తూ, వివిధ సంఘాల కార్యకర్తల చేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తుంటే చూస్తూ ఊరుకుంటున్నది. అంతేకాక పోలీసు సిబ్బందిలోనే కొందరు ప్రైవేటు ముఠాల ముసుగులో వ్యవహరిస్తున్న సూచనలు ఉన్నాయి. బెదిరింపులు లిఖిత పూర్వకమైన పత్రికా ప్రకటనల రూపంలో ఇస్తున్నప్పటికీ, ఫోన్‌లు చేస్తున్న నంబర్లను బాధితులు గుర్తించి పోలీసులకు తెలియచేస్తున్నప్పటికీ, ఒక్క 'టైగర్'ను గానీ, ఒక్క 'కోబ్రా'ను గానీ పోలీసులిప్పటి దాకా గుర్తించలేదు. ఒకే ఒక మినహాయింపు (మొదట్లో చెప్పినట్టు) వరంగల్ చర్చల వాతావరణంలో 2004లో అరెస్టు చేసిన మాజీ కానిస్టేబుల్ జావేద్.

నిజానికి ఈ నక్సలైట్ – వ్యతిరేక వ్యూహాన్ని పోలీసులు చాలా మురిపెంగా తిలకిస్తున్నారు. దీర్ఘకాలం పనిచేస్తున్న ఉద్యమ కార్యకర్తల చేత పని మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టే లక్ష్యం ఏదైతే పోలీసులు సంవత్సరాల తరబడి ఎంత నిర్బంధం ప్రయోగించినా సాధించలేకపోయారో దానిని ఈ టైగర్లు, కోబ్రాలు కొద్ది వారాలలోనే సాధించారు. కార్యకర్తలలో కొందరు తమ ఆత్మగౌరవాన్ని కూడా వదులుకొని, తాము ఉద్యమం నుంచి వైదొలుగుతున్నామన్న విషయాన్ని గమనించి తమను విడిచిపెట్టమని ఈ అదృశ్య పీడకులకు విజ్ఞప్తులు కూడా చేసుకున్నారు. ఆ పని చేయొద్దనుకున్నవారు భయం వల్ల సమర్థంగా పని చేయలేకున్నారు. పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా మాట్లాడగల సంస్థ ఒక్కటీ లేని పరిస్థితి ఒక జిల్లా తరువాత ఒక జిల్లాలో నెలకొనింది. మానవహక్కుల వేదిక ఒక్కటే దీనికి మినహాయింపుగా ఉంది. అయితే ఇప్పటివరకు ఈ వికృత వ్యూహాన్ని మేము తట్టుకోగలిగాము గానీ ఈ స్థితి శాశ్వతంగా ఉంటుందని మేము కూడా హామీ ఇవ్వలేము.

ఈ సమస్య పట్ల నిరసనను హక్కుల నుడికారంలో తెలపాలని మానవహక్కుల వేదిక భావిస్తుంది. ఆ కారణంగా మేము పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా ఆందోళన చేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రజాసంఘాల ఉమ్మడి వేదికలో భాగం కాలేదు. అయితే వారి ఊరేగింపులలో, సభలలో పాల్గొంటున్నాము. మా వంతుగా, ఎప్పుడు సందర్భం వచ్చినా ఈ టైగర్లు, కోబ్రాల నేర చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాం. ఈ ముఠాల ఆగడాల విషయంలో ఏమీ చేయకుండా ఉన్న ప్రభుత్వ నిర్వ్యాపకత్వం పట్ల హోంమంత్రిని కలిసి నిరసన తెలిపాము. మా నిరసనను లిఖిత పూర్వకంగా ఇమ్మని ఆయన కోరగా, 2005 సెప్టెంబర్ 1వ తేదీన ఇచ్చాము. ఆ ఫిర్యాదు ప్రతిని ఈ లేఖతో జతచేస్తున్నాం. మళ్ళీ కూడా మేము హోంమంత్రిని కలిశాము గానీ కోబ్రాలంటే కేవలం నక్సలైట్ బాధితులేననీ కోబ్రాల చర్యలతో పెద్దగా ఆందోళన చెందవలసిందేమీ లేదని పోలీసుల మాటల్నే ఆయన కూడా పలుకుతున్నాడు. ఇక పోలీసులు వాళ్ళను పట్టుకోలేక పోతున్నారు, నిరోధించలేకపోతున్నారు అంటారా? పోలీసులు నక్సలైట్లను మాత్రం పట్టుకోగలుగుతున్నారా, నిరోధించగలుగుతున్నారా? అని ప్రశ్నిస్తున్నాడు.

ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక అభిప్రాయం. ఇది సందేహాస్పదం అన్న మా అభిప్రాయాన్ని ఇప్పటికే వివరించాము. మీ నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నాం.

రాష్ట్ర లోకాయుక్త వద్ద కోబ్రాలను నిలువరించడానికి ఉద్దేశ పూర్వకంగానే ఏ చర్యా తీసు కోకపోవడం వల్ల వారి బాధితులకు తీవ్ర హాని కలుగుతున్నదన్న ఫిర్యాదొకటి దాఖలైంది. ఈ ఫిర్యాదులో రాష్ట్ర హోంమంత్రిని, డిజిపిని, ఐజి (ఇంటెలిజెన్స్)ను ప్రతివాదులుగా పేర్కొనడం జరిగింది. ఫిర్యాది విప్లవ రచయితల సంఘం సభ్యుడైన చలసాని ప్రసాద్. సీనియర్ న్యాయవాది, పౌరహక్కుల ప్రజాసంఘం జాతీయ అధ్యక్షుడు అయిన కె.జి.కన్నాభిరాన్ గారి సలహా మేరకు ఈ ఫిర్యాదు దాఖలైంది. ఈ ఫిర్యాదు పైన జరగగల విచారణను ఫలప్రదంగా నడిపించడానికి అవసర మైన సాక్ష్యాలను సేకరించే బాధ్యత మానవహక్కుల వేదిక తన మీద వేసుకుంది.

ఈ ముఠాలు, వాటి హింసాత్మక చర్యల విషయంలో ప్రభుత్వం బాధ్యతను నొక్కి చెప్పే డిమాండ్లతో వీలైనంత ఎక్కువగా సంతకాలు సేకరించి ఉత్తరాలు పంపించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాము. ఈ ముఠాల కార్యకలాపాల గురించి చేసిన నేర పరిశోధన ఫలితాన్ని, వారిని నిలువరించడానికి తీసుకున్న చర్యలను బహిర్గతం చేయవలసిందిగా మేము ప్రభుత్వాన్ని కోరు తున్నాము. దానితో బాటు, ఈ రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడడానికి ఉపయోగపడతాయని మీకు తోచే ఇతర డిమాండ్లు కూడా చేర్చమని మిమ్మల్ని కోరుతున్నాము.

**11-2-2006**